క్లుప్తంగా

గుర్తింపు ఎన్నికల్లో వైఎస్సార్ టీయూసీ పోటీ



మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో త్వరలో జరగనున్న గుర్తింపు ఎన్నికల్లో వైఎస్సార్ టీయూసీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ నాయకులు తెలిపారు. మంగళవారం 68వ వార్డు మిందిలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి ఎన్నికల్లో విజయంపై ప్రణాళికను రూపొందించాలని కోరారు. జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తప్పుడు ప్రచారం చేసి వైఎస్సార్ సీపీపై బురదజల్లి ఎన్నికల్లో లబ్ధిపొందారని నాయకులు తెలిపారు. ఇప్పుడు నిజం తెలుసుకున్న కార్మికులు ప్రైవేటీకరణ కాకుండా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాపాడారని గ్రహించారన్నారు. ఎన్నికల తర్వాత ఉక్కు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని కార్మికులు తెలుసుకున్నారని చెప్పారు. గుర్తింపు ఎన్నికల్లో వైఎస్సార్ టీయూసీని గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ నాయకులు మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ, పిట్టా రెడ్డి, ఎన్నేటి రమణ, సంపంగి ఈశ్వరరావు, కర్రి దాలినాయుడు, అండిబోయిన అప్పారావు, చిత్రాడ వెంకటరమణ, దరిగి రవి, బోర శశిభూషణ్, వాసా అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాలమ్మతల్లి మహోత్సవాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో ఈ నెల 7న మొదలైన దుర్గాలమ్మ తల్లి పండగ మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మేళ తాళాలు, బాణ సంచా నడుమ మల్కాపురం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు–కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విగ్రహాల మాటున దుకాణాల ఏర్పాటుపై ఫిర్యాదు

అగనంపూడి: కూర్మన్నపాలెం జాతీయ రహదారి బస్‌బేను ఆనుకుని జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు పేరుతో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉక్కు కో–ఆపరేటివ్ స్టోర్స్ మాజీ డైరెక్టర్ కాసా పద్మరాజు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకుడిగా చలామణి అయిన వ్యక్తి గతంలో జాతీయ నాయకుల విగ్రహాలను రహదారిపై ఏర్పాటు చేశారని, అయితే వాటిని ఆనుకొని ప్రస్తుతం పక్కా కట్టడాలు చేపతుండడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు బస్టాప్‌ను ఆనుకొని చేపడుతున్న పక్కా కట్టడాలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

యాదవుల హక్కుల పరిరక్షణకు వినతి



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న వేదిక ప్రతినిధులు

అగనంపూడి: యాదవుల హక్కుల పరిరక్షణకు తెలుగుదేశం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు కోరారు. పల్లా శ్రీనివాసరావును విశాఖలో కలిసిన నాయకులు యాదవుల సమస్యలు వివరించారు. యాదవులను ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. దామాషా పద్ధతిలో రాజకీయపరంగా పదవుల కేటాయింపుపై విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, కార్యదర్శి మాడిశ వెంకటరావు, యలమంచిలి వెంకటరావు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

‘దువ్వాడ’..ప్రగతి జాడ

- ‘అమృత్ భారత్ స్టేషన్’ గా అభివృద్ధి
- మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- రూ.26.3 కోట్లతో చురుగ్గా పనులు



ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు నిర్మిస్తున్న భవన సముదాయం



దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై నిర్మిస్తున్న షెల్టర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గతేడాది ఆగస్టులో రూ.26 కోట్ల 31 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో అభివృద్ధి, వసతుల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

భవనాల నిర్మాణం

ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన ఆరంభంలో పరిపాలనా భవనం, ప్రధాన భవనం, టికెట్ బుకింగ్ కౌంటర్, పీఆర్ఎస్ కౌంటర్, ఆర్ఆర్ క్యాబిన్, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 190 మీటర్ల పొడవు, 14 చదరపు మీటర్ల వెడల్పులో భవనాల నిర్మాణం చేపడుతున్నారు.

మెయిన్ లైన్‌గా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం

1997లో నిర్మించిన పాత భవనం తొలగించి కొత్తగా ప్లాట్‌ఫాం నిర్మించనున్నారు. ఈ ప్లాట్‌ఫాంను ఒకటో నంబర్‌గా మార్చనున్నారు. ప్రస్తుతం ఉన్న ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంను మెయిన్ లైన్‌గా మార్చనున్నారు. ఈ ట్రాక్‌లో వందేభారత్, దురంతో, మెయిల్, కోరమండల్ వంటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు నేరుగా వెళ్లిపోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. వీటికి సమీపంలో ఆర్పీఎఫ్ సిబ్బంది బ్యారక్స్ (వసతి, భోజన సదుపాయాలతో కూడిన భవన సముదాయం) నిర్మాణం 50 శాతం పూర్తి కావచ్చింది.

- ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు మొదలయ్యాయి.
- నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు నాగదేవత కొండకు రక్షణ గోడ నిర్మించే పనులు చకచకా సాగుతున్నాయి. కొండ చరియలు జారిపడకుండా ఈ నిర్మాణం చేపడుతున్నారు.
- ఒకటి, నాలుగు ప్లాట్‌ఫాంల వైపు ఉన్న రహదారులు, డ్రైనేజీలు విస్తరించి, బస్‌బేలు ఏర్పాటు చేయనున్నారు.
- ఒకటి, నాలుగు ప్లాట్‌ఫాంలపై ప్రయాణికులు సేద తీరడానికి షెల్టర్ల నిర్మాణం ప్రారంభించారు.

మరో ఏడాదిలో స్టేషన్ రూపు రేఖలు మారనుండడంతో పాటు విశాఖ ప్రధాన రైల్వేస్టేషన్‌కు సమాంతరంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంతేకాకుండా అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వనుండడంతో పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు నిర్మిస్తున్న రక్షణ గోడ

కేంద్ర ఉక్కు మంత్రి పర్యటనపై సర్వత్రా ఆసక్తి

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ పర్యటనలో కేంద్ర మంత్రి సానుకూల ప్రకటన చేస్తారని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ విక్రయానికి సంబంధించి కార్మిక సంఘాలు ఆందోళనలు, దీక్షలు కొనసాగిస్తున్నాయి. అయినప్పటికీ ప్రైవేటీకరణ నిలుపుదలపై మూడున్నరేళ్లుగా బీజేపీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వ ప్రకటన వచ్చిన నాటి నుంచి స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ తీవ్రంగా కొనసాగింది. తీవ్ర ఆర్థిక దుర్భిక్షంతో చివరకు ఉద్యోగులకు గత ఆరు నెలలుగా సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితిలోకి నెట్టబడింది. కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన నేపథ్యంలో ప్రైవేటీకరణ నిలుపుదల జరుగుతుందన్న ఆశలు పెరిగాయి. దీనికి తోడు ఉక్కు శాఖ సహాయ మంత్రిగా భీమవరం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ నియమితులు కావడంతో మరింత ఆశలు పెరిగాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ఎంపీలు పురంధేశ్వరి, సీఎం రమేష్, శ్రీనివాసవర్మ కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్ అంశంపై 45 రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన హామీ ఇచ్చిన 15 రోజుల్లోనే స్టీల్ ప్లాంట్ పర్యటన ఏర్పాటు కావడం పట్ల కార్మిక సంఘాలు, ఉద్యోగులు సానుకూల ప్రకటన వెల్లువడుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. అయితే ఆయన పర్యటన కేవలం మూడున్నర గంటలు ఉండటం.. అదీ కాకుండా ప్లాంట్ సందర్శన, ఉక్కు యాజమాన్యంతో రివ్యూ మీటింగ్‌కు పరిమితం కావడంతో కార్మిక సంఘాలు, అసోసియేషన్లను కలిసే అవకాశం కూడా లేకపోవడం నిరాశ కలిగిస్తున్నది. ఏది ఏమైనా కేంద్ర మంత్రి తమ పర్యటనలో చేసే ప్రకటనపై ఉక్కు వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కు కార్మికులకు తక్షణం జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కార్మికులపై సర్క్యులర్ రూపంలో చేస్తున్న దాడిని ఆపి, తక్షణం జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు యాజమాన్యం అనాలోచితంగా, అవివేకంతో విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈఎంఐ చెల్లించే పరిస్థితి లేకుండా అపరాధులుగా చిత్రీకరించాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. యాజమాన్యం ఇటువంటి ఆలోచనలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు వై.టి.దాస్ మాట్లాడుతూ అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్న సీఎండీని తక్షణం రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పి.శ్రీనివాసరాజు, కె.బాలశౌరి, టి.వి.కె.రాజు, సూర్యనారాయణ, ముత్యాల నాయుడు, బి.మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అదుపులో నేరాలు



76వ వార్డు స్వతంత్రనగర్‌లో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ



తమ ప్రాంతంలో నేరాలపై సీపీకి తెలుపుతున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: ప్రజల సహకారంతో నేరాలు అదుపు చేయవచ్చని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. 76వ వార్డు స్వతంత్రనగర్ పప్పుల ఫ్యాక్టరీ వద్ద మంగళవారం రాత్రి స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. అధ్యక్షత వహించిన డీసీపీ–2 మేకా సత్తిబాబు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్‌గా వచ్చిన బాగ్చి నేరాల అదుపునకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్వతంత్రనగర్ మహిళలు ఈ ప్రాంతంలో జరుగుతున్న నేరాలపై తెలపాలన్నారు. దీనికి స్పందించిన స్థానిక మహిళలు మాట్లాడుతూ తమ ప్రాంతంలో చాలా చోట్ల వీధిలైట్లు లేవని, ఖాళీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో తుప్పలతో నిండి పోయాయని తెలిపారు. దొంగలు, నేరగాళ్లు రాత్రిళ్లు నేరాలకు పాల్పడి తుప్పల్లో దాక్కుంటున్నారని వివరించారు. ఎక్కువగా స్క్రాప్ వ్యాపారాలు జరుగుతుంటాయని, సిగరెట్లు, మద్యం బహిరంగ ప్రదేశాల్లోనే సేవిస్తుంటారని తెలిపారు. దీనికి స్పందించిన సీపీ వెంటనే పోలీస్ సిబ్బందిని అలెర్ట్ చేయాలన్నారు. కాలనీలో వీధిలైట్లు పునరుద్ధరించాలని, తుప్పలు కొట్టించి నేరగాళ్లకు క్లెం వేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 4 బ్యాచ్‌ల పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాను 1వ తేదీన విధుల్లో చేరానని, ఇప్పటి వరకు 4 ప్రాంతాల ప్రజలతో ముఖాముఖి నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఎక్కడైనా గ్యాంబ్లింగ్, గంజాయి సేవించడం, రవాణా వంటివి జరిగితే ఉక్కుపాదం మోపుతామన్నారు. తమ పిల్లలు తప్పుదారి పట్టకుండా వారిని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. 7995095977 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తానన్నారు. సమాచారం ఇచ్చిన వారి నంబర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ వి.శ్రీనివాసరావు, క్రైం సీఐ కె.శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు, సిబ్బంది, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

‘స్టాప్ డయేరియా’పై అవగాహన కల్పించాలి

మహారాణిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం రైతు, కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లోని రైతు లతో సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతు లకు ఎలాంటి జీవిత బీమా వర్తిస్తుంది? ప్రమాదానికి గురైన వారికి ఆర్థిక సహాయం అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిపై అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్: మలేరియా, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జియాలజిస్ట్ సాంబమూర్తి సూచించారు. స్థానిక 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షపు నీరు, మంచినీటిలో దోమలు పెరుగుతాయని, వారానికి ఒకసారి నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, ట్యాంక్‌లను శుభ్రపరచుకోవాలని సూచించారు. ఇంటిలో ఉండే గోలాలు, కుండీలు, ట్యాంకులపై మూతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలని చెప్పారు. ఈ సందర్భంగా దోమలు పెరిగే ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రదర్శన ఏర్పాటు చేశారు. జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్లు బి.శ్రీనివాస్, బి.కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా జువ్వాలమ్మ పండగ

గోపాలపట్నం : జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో జువ్వాలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ అర్చకులు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇల్లపు మహాలక్ష్మినాయుడు, వరహాలు, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. మంగళవారం మాధవధారలో ఆర్‌టీఏ కార్యాలయంలో సిబ్బంది, ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో జె.రామ్‌కుమార్, ఆర్‌టీఏ సిబ్బంది, పోలీసులు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ పాల్గొని పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సీనియర్ జడ్జి శేషమ్మ కోరారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి



విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో కొలువైన జగన్నాథస్వామి మంగళవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అగనంపూడి పరిసర కాలనీల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బొర్రమాంబ సేవా సమితి, మరిడిమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నాగమణి, కుసుమంచి కుమారి, వరదారాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలే ‘ఉక్కు’ దుస్థితికి కారణం

అగనంపూడి: పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానాలు, ఉక్కు కర్మాగారానికి సహాయ నిరాకరణ వల్ల ఉక్కు పరిశ్రమకు ఈ దుస్థితి ఎదురైందని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 1244వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు నష్టాల్లో ఉందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రకటించడం అన్యాయమన్నారు. అది అవాస్తవమన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తామని ప్రకటించే వరకు ఉక్కు పరిస్థితి ఆశాజనకంగా ఉండేదని తెలిపారు. అలాంటి ఉక్కు ఊపిరి తీసి, వారి అనుయాయులకు అప్పగించాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలో కేంద్ర సహాయ మంత్రి కూడా భాగస్వాములు కావొద్దని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కులుకూరి మంగరాజుకు గౌరవ డాక్టరేట్

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి కొత్త కర్ణవానిపాలేనికి చెందిన కులుకూరి మంగరాజుకు గౌరవ డాక్టరేట్ లభించింది. సామాజిక సేవారంగంలో మంగరాజు అందిస్తున్న సేవలను గుర్తించి కేంబ్రిడ్జి యూనివర్సిటీ (యూఎస్ఏ) ప్రతినిధులు నోయిడాలోని క్రౌన్ ప్లాజా హోటల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సీఈవో డాక్టర్ కృష్ణకుమార్, జనతాదళ్ జాతీయ కార్యదర్శి సంజయ్ వర్మ, ఏంజెల్ మెరీనా టర్కీ, సినీ తార శిఖా మల్హోత్రా చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు.



మంగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

ఆరిలోవ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలన్నారు. కొంత మంది విద్యార్థి దశ నుంచే గంజాయికి అలవాటుపడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సరదాగా మొదట్లో గంజాయి, మద్యం తాగడంతో అది అలవాటుగా మారి భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని గమనించి మోసపోవద్దని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

గిరి ప్రదక్షిణకు బీఆర్‌టీఎస్‌లో సన్నాహాలు

ఆరిలోవ: సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణకు జీవీఎంసీ అధికారులు బీఆర్‌టీఎస్ రోడ్డును సన్నద్ధం చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక నుంచి అడవివరం వరకు జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది మంగళవారం విద్యుత్ దీపాలను పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వాటికి అమర్చిన బల్బులు వెలుగుతున్నాయో? లేదో? జేసీబీ సహాయంతో పైకి ఎక్కి పరిశీలించారు. వెలగని బల్బులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. జీవీఎంసీ జోన్–2 కమిషనర్ శైలజావల్లి టీపీవో వరప్రసాద్, సచివాలయాల సిబ్బందితో కలిసి బీఆర్‌టీఎస్‌లో పర్యటించారు. రోడ్డు పక్కన బడ్డీల నిర్వాహణను పరిశీలించారు. పెదగదిలి, చినగదిలి కూడళ్లలో రోడ్డు మీద నిర్వహిస్తున్న బడ్డీలను లోపలికి జరిపించారు. బడ్డీల పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.



పెదగదిలి వద్ద జేసీబీ సహాయంతో విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అద్భుత కళా ఖండాలు

ఆరిలోవ: చిత్ర లేఖనం కొందరికి హాబీ. మరికొందరికి ప్యాషన్. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాలపైనా దృష్టిపెడుతున్నారు. ఆటలు, నృత్యాలతో పాటు కళలపైనా మక్కువ పెంచుకుంటున్నారు. అటువంటి వాటిలో చిత్రలేఖనం ప్రధానంగా నిలుస్తుంది. మదిలో మెదిలే ఆలోచనలు, ఊహకందని ఆలోచనలకూ దృశ్య రూపం ఇవ్వడమే చిత్ర లేఖనం. అటువంటి చిత్ర లేఖనంలో విశాఖ కేంద్ర కారాగారం సమీప శ్రీకృష్ణాపురంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు విద్యతో పాటు చిత్ర లేఖనంలో అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. వారు వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ కట్టడాలు, పలు రకాల పండ్లు, పూలు, పక్షులు, చెట్లు, జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, పల్లె వాతావరణం తదితర వాటిని వాటర్ పెయింటింగ్స్ చేశారు. వాటితో పాటు కాగితాలతో వివిధ ఆకారాల్లో బొమ్మలు తయారు చేశారు. వీటన్నింటిని ఇక్కడ గురుకులం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ఓ హాల్లో సందర్శనకు కోసం ఏర్పాటు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం ప్రదర్శిస్తుండడంపై ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు. శనివారం గురుకులాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్ ఈ చిత్రాలను పరిశీలించి అభినందించారు. ఈ చిత్రాలు వేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



పేపర్‌తో తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు